సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

సోమవారం : 22 : మే : 2023



ఓపెన్ జిమ్‌లపై ఫోకస్..

కొత్తగూడెం, పాల్వంచ మున్సిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌లను అభివృద్ధిపర్చే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. 8లో



.. సబ్ కాంట్రాక్టర్లదే హవా

సింగరేణి సంస్థలో పలువురు కాంట్రాక్టర్లు సబ్ కాంట్రాక్టర్లకు పనులు అప్పగిస్తుండడంతో వారు అక్రమాలకు పాల్పడుతున్నారు. 10లో



వాతావరణం

జిల్లాలో సోమవారం ఉష్ణోగ్రతలు అధికంగానే నమోదవుతాయి. కొన్ని చోట్ల మాత్రం వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ పుష్పార్చన



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి ఆదివారం వైభవంగా సవర్ణ పుష్పార్చన నిర్వహించారు. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం కంకణధారణ, యజ్ఞోప వీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా జరిపించారు. కాగా, ఆదివారం సెలవు కావడంతో భక్తులు భారీగా హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యకల్యాణ వేడుకలోనూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి విశేష పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) అమ్మవారికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు అమ్మవారిని దర్శించుకుని తలనీలాలు, ఒడిబియ్యం, చీరలు, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మహిపతి రామలింగం, సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు, ఎస్వీఆర్‌కే ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏఈఈ పరీక్ష ప్రశాంతం



అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

సుజాతనగర్: టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో తొలిరోజు ఆదివారం జరిగిన ఏఈఈ(అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం సెషన్‌లో 125 మందికి గాను 100 మంది, రెండో సెషన్‌లో 125 మందికి 101 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. రెండు విడతల్లో కలిపి 49 మంది గైర్హాజరయ్యారని నిర్వాహకులు తెలిపారు.

పాల్వంచలో..

పాల్వంచరూరల్ : పాల్వంచ అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన ఏఈఈ రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్ష జరగగా, 100 మందికి గాను 75 మంది అభ్యర్థులు హాజరయ్యారని, 25 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.వి.సుబ్బారావు తెలిపారు.

కిన్నెరసానిలో పర్యాటకుల కళకళ



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి ఆదివారం భారీగా వచ్చిన పర్యాటకులతో సందడి నెలకొంది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి పర్యాటకులు వచ్చారు. డీర్ పార్కులోని దుప్పులు, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించడమే కాక బోటు షికారు చేశారు. 723 మంది పర్యాటకులు రావడం ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.20,975, 200 మంది బోటింగ్ చేయడంతో టూరిజం శాఖకు 12,310 ఆదాయం లభించిందని అధికారులు తెలిపారు.



శునకాల్లో సమ్మర్ స్ట్రెస్ !

ఎండ వేడితో ఒత్తిడికి గురవుతున్న వీధి కుక్కలు

- గ్రామాలు, పట్టణాల్లో కరువైన నీడ, నీరు
- కొంచెం కవ్వించినా దాడి చేస్తున్న వైనం
- నీటి తొట్లు అవసరమంటున్న పశు వైద్యులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఎండలు విపరీతంగా పెరిగినప్పటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు చోట్ల మనుషులపై వీధి కుక్కలు దాడి చేస్తున్న ఘటనలు వెలుగు చూస్తున్నాయి. ఉష్ణోగ్రత 40 సెల్సియస్ డిగ్రీలు దాటితే పశువులు, కుక్కలు సమ్మర్ స్ట్రెస్‌కు గురవుతాయని వెటర్నరీ డాక్టర్లు చెబుతున్నారు. ప్రధానంగా సరైన తిండి, నీరు, నీడ కరువవుతుండడంతో వీధి కుక్కలు, వీధి పశువుల్లో ఈ తరహా లక్షణాలు ఎక్కువగా ఉంటాయని వెల్లడిస్తున్నారు.



నీళ్ల కరువు..

గ్రామాలు మొదలు మున్సిపాలిటీల వరకు చాలాచోట్ల డ్రెయినేజీ వ్యవస్థ మెరుగైంది. అదేవిధంగా ఇంటింటికీ కుళాయిలు రావడంతో వీధి కుళాయిలు, బోర్ల సంఖ్య తగ్గిపోతోంది. ఫలితంగా ఇలాంటి నీటి వనరులపై ఆధారపడే వీధి కుక్కలకు తగినంత నీరు లభించని పరిస్థితి నెలకొంది. దీనికితోడు రోడ్ల విస్తరణ, కరెంటు వైర్ల కోసం చెట్లు నరికేయడం, రోడ్లపైనే వాహనాల పార్కింగ్ వంటి కారణాలతో సరైన నీడ కూడా లేకుండా పోతోంది. దీంతో కుక్కలు సమ్మర్ స్ట్రెస్‌కు లోనవుతున్నాయి. ఈ సమయంలో వాటి కవే తగువు పెట్టుకుంటాయని, ఏ మాత్రం కవ్వించినా దాడి చేయడానికి వెనుకాడవని చెబుతున్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు కుక్కలను రాయితో కొట్టడం, కళ్లలో కళ్లు పెట్టి చూడటం, బెదిరించినట్టుగా ప్రవర్తించడం సరికాదని సూచిస్తున్నారు.

మూలన పడిన ప్రతిపాదనలు

వేసవిలో వీధి కుక్కలతో పాటు పశువులకు సైతం నీరు అందించేందుకు గతంలో గ్రామాలు, పట్టణాల్లో కూడా నీటి తొట్లు(వాటర్ త్రోట్) ఉండేవి. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలతో పాటు కొన్ని సందర్భాల్లో స్థానికులు, జంతు ప్రేమికులు సైతం నీటిని అందుబాటులో ఉంచేవారు. కొన్నేళ్లుగా నీటి తొట్ల నిర్వహణ లేక చాలాచోట్ల కనుమరుగైపోయాయి. మరి కొన్ని చోట్ల ఉపయోగించలేని స్థితికి చేరుకున్నాయి. రెండేళ్ల క్రితం నీటి తొట్ల ఏర్పాటు కోసం ప్రతిపాదనలు పంపించాలని అన్ని జిల్లాల పశుసంవర్థక శాఖ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో వారు ప్రతిపాదనలు సిద్ధం చేసి సర్కారుకు అందించినా ఎలాంటి ప్రగతి కనిపించలేదు. ప్రస్తుతం మనుషులపై జరుగుతున్న కుక్కల దాడుల నేపథ్యంలోనైనా నీటి తొట్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఉష్ణోగ్రతలతో ఒత్తిడి



ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటే కుక్కలు ఒత్తిడికి లోనవుతాయి. దీంతో కలహించుకునే స్వభావం వాటిలో పెరుగుతుంది. ఈ సమయంలో ఎవరైనా టీజ్ చేసినట్టు వాటికి అనిపిస్తే దాడి చేస్తాయి. తాగునీటిని అందుబాటులో ఉంచడం ద్వారా కొంత మేర సమస్యను అదుపులోకి తీసుకురావొచ్చు.

– డాక్టర్ టి.అరుణభారతి, పశు సంవర్థక శాఖ ఏడీ

‘గ్రూప్–4’ కేంద్రాలను పరిశీలించండి

- తక్షణమే నివేదికలు అందజేయాలి
- అధికారులకు అదనపు కలెక్టర్ సూచన



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సూపర్‌బజార్(కొత్తగూడెం) : జూలై 1న టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో జరిగే గ్రూప్ – 4 పరీక్షకు జిల్లాలో ఏయే పాఠశాలలు, కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేయవచ్చో పరిశీలించి, నివేదిక అందజేయాలని అదనపు కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. ఆదివారం ఆయన టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. పరీక్ష నిర్వహణకు సుజాతనగర్, చుంచుపల్లి, కొత్తగూడెం, లక్ష్మీదేవిపల్లి, పాల్వంచ, మణుగూరు, ఇల్లెందు, భద్రాచలంలో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 30వేల మంది అభ్యర్థులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. పరీక్షలు నిర్వహించే పాఠశాలలు, కళాశాలల్లో విద్యుత్ సౌకర్యం, కుర్చీలు, ఫ్యాన్లు, సీసీ కెమెరాలు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు ఉండాలని, ఎక్కడైనా లేకుంటే నివేదికలో తెలియజేయాలని చెప్పారు. పరీక్ష కేంద్రాల చిరునామా కూడా స్పష్టంగా ఉంటేనే అభ్యర్థులకు సులభంగా అర్థమవుతుందని అన్నారు. ఆయా కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు తనిఖీ చేసి సోమవారం నివేదికలు అందజేయాలని ఆదేశించారు. టెలీకాన్ఫరెన్స్‌లో డీఈఓ సోమశేఖరశర్మ, డీపీఓ రమాకాంత్, డీఆర్డీఓ మధుసూదన్ రాజు, జెడ్పీ సీఈఓ విద్యాలత, కొత్తగూడెం, ఇల్లెందు, మణుగూరు మున్సిపల్ కమిషనర్లు రఘు, అంకుషావలి, ఉమా మహేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశ పరీక్షకు 239 మంది హాజరు



పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ స్టడీసర్కిల్‌లో ఐదు నెలల పాటు ఉచితంగా ఇచ్చే ఫౌండేషన్ కోర్సు కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షకు 239 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాలలో ఈ పరీక్ష నిర్వహించగా ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ పరిశీలించి మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచి 327 మంది దరఖాస్తులు చేసుకోగా, 88 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. పరీక్ష రాసిన వారిలో వంద మందిని ఎంపిక చేసిన వచ్చే నెల 1వ తేదీ నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నటుల చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జకీరుల్లా, స్టడీ సర్కిల్ హానరరీ డైరెక్టర్ సీహెచ్.వీరభద్రం, ఉద్యోగులు డాక్టర్ జె.రమేష్, ఎస్.ప్రియాంక, డీవీఎల్ఎన్.జయశ్రీ, ఏ.లిఖిత పాల్గొన్నారు.

రోడ్లు, లైట్లు ఉంటే అభివృద్ధా?



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పక్కన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రొఫెసర్ కోదండరాం, జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య తదితరులు

- మట్టి గుట్టలు, ప్లాట్లనూ వదలని మంత్రి అనుచరులు
- ఖమ్మం ప్రజలు స్వేచ్ఛగా తిరిగే పరిస్థితి లేదు..
- అక్రమాలకు పాల్పడే అధికారులు క్షమాపణ చెప్పాల్సి ఉంటుంది
- ఆత్మీయ సమ్మేళనంలో మాజీ ఎంపీ పొంగులేటి



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన జనం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ‘నల్లటి రోడ్లు వేసి, మిణుకు లైట్లు ఏర్పాటుచేసి ఇదే అభివృద్ధి అనుకుంటే ప్రజలు దీవించరు.. మనుషులను గౌరవించాలి.. రాజ్యమెప్పుడూ మీ చేతుల్లో ఉండదు.... ప్రజాదీవెన ముందు ఎంతటి వారైనా ఇంటికి పోయే రోజున పోవాల్సిందే..’ అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలోని ఎస్ఆర్ గార్డెన్స్ సమీపాన ఖమ్మం నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం రాత్రి ఏర్పాటుచేయగా భారీ సంఖ్యలో పొంగులేటి అనుచరులు, అభిమానులు తరలివచ్చారు. శ్రీనివాసరెడ్డితో పాటు ఈ సమ్మేళనానికి అతిథులుగా హాజరైన మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంను అభిమానులు సన్మానించారు. అనంతరం సమ్మేళనాన్ని ఉద్దేశించి పొంగులేటి మాట్లాడుతూ మంత్రి అనుచరులు ఖమ్మంలో మట్టి కొండలనూ వదలడం లేదని, ప్లాట్లను ఆక్రమిస్తున్నారని ఆరోపించారు. ప్లాట్లను ఆక్రమిస్తే స్వయంగా ఆ పార్టీ కార్పొరేటరే బాధితుల తరఫున నిరసన తెలిపారని గుర్తుచేశారు. తన, పర బేధం లేకుండా సామాన్యులను ఇబ్బంది పెడుతూ భయభ్రాంతులకు గురిచేసేలా అనుచరులను ఉసిగొల్పడమే మంత్రి అజెండా అని ఆరోపించారు. ఖమ్మం నగరం, రఘునాథపాలెం మండలంలోని పోలీసు, రెవెన్యూ వ్యవస్థ మొత్తం తన కంట్రోల్‌లో ఉన్నట్లు మంత్రి భావిస్తున్నారని, ఇది పటాపంచలయ్యే రోజు దగ్గరలోనే ఉందని చెప్పారు. అధికారం ఎవరి సొత్తు, శాశ్వతం కాదనే విషయాన్ని గుర్తించి ప్రజల అభిప్రాయాలను గౌరవించాలని సూచించారు. ప్రజల ఆత్మాభిమానం, తీర్పు ముందు ఎంతటి పెద్దవారైన తలవంచక తప్పదని, ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది నియోజకవర్గాల్లోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఇది వర్తిస్తుందని పొంగులేటి తెలిపారు.

ఐదు నెలల తర్వాత నిగ్గదీస్తాం..

గడిచిన నాలుగేళ్లలో అక్రమాలు, అన్యాయాలు చేసి సామాన్య ప్రజానీకాన్ని ఏ అధికారులైతే ఇబ్బంది పెడుతున్నారో ఐదు నెలల తర్వాత రాబోయే ప్రభుత్వంలో వారు రాష్ట్రంలో ఏ మూలన ఉన్నా నిగ్గదీస్తామని పొంగులేటి హెచ్చరించారు. పోలీసులు ఎన్ని కేసులు పెట్టినా, ఐదు నెలల తర్వాత ఈ కేసుల ఫైల్స్ పట్టుకొని తమ ప్రజాప్రతినిధులకు క్షమాపణ చెప్పి విత్‌డ్రా చేసుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ఏ ఒక్క ఓటరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ ఫార్ములా ఒక్క ఖమ్మం నియోజకవర్గానికే కాదు.. కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు కూడా వర్తిస్తుందన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రజలు, తెలంగాణ బిడ్డలు.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడితే తమ బతుకులు బాగుపడతాయని ఆశించగా కల్వకుంట్ల కుటుంబం రూ.వేల కోట్లు సంపాదించిందే తప్ప ప్రజల కష్టాలు మాత్రం తీరలేదన్నారు. రానున్న రోజుల్లో ఎన్ని కష్టాలు, ఇబ్బందులు ఎదురైనా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది నియోజకవర్గాల్లో ఏ ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థిని అసెంబ్లీ గేటు తాకనివ్వనని తాను చెప్పిన మాట నిలబెట్టేలా అనుచరులు పూనుకోవాలన్నారు.

కొట్లాడినా ఫలాలు దక్కలే..

ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ ఎవరైతే తెలంగాణ కోసం కొట్లాడారో వారికి ఫలాలు దక్కడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణను కల్వకుంట్ల కుటుంబం చెర నుంచి విడిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య హక్కులను కాపాడుకోవడానికి తెలంగాణ బచావో నినాదం కావాలన్నారు. ఈ కీలకమైన సమయంలో తెలంగాణలో దోపిడీ పాలనను ఆమోదించడానికి సిద్ధంగా లేమని చెప్పారు. మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ ప్రతీ సందర్భంలో కేసీఆర్ పునర్నిర్మాణం, అంబేద్కర్ స్ఫూర్తి అని చెబుతున్నా ఏ లక్ష్యం కోసమైతే తెలంగాణను తెచ్చుకున్నామో ఆ లక్ష్యం నెరవేరలేదన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌నే ఖతం చేశారని, దీనికి సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉద్యోగులకు జీతం ఇవ్వలేని పరిస్థితి ఉందని పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి తొమ్మిదేళ్లు గడిచినా ఇవ్వలేదన్నారు. సమ్మేళనంలోజెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, వైరా మున్సిపల్ చైర్మన్ జైపాల్, నాయకులు మువ్వా విజయ్‌బాబు, బొర్రా రాజశేఖర్, విజయాబాయి, తెల్లం వెంకట్రావు, తుళ్లూరి బ్రహ్మయ్య, పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, కోట రాంబాబు, జారె ఆదినారాయణ, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

జాబ్‌మేళా.. కళకళ !

పోలీసు శాఖ ఆధ్వర్యాన మెగా జాబ్‌మేళా

- పది వేల మంది వరకు హాజరైన అభ్యర్థులు
- 150 కంపెనీల ద్వారా 8,025 మంది ఎంపిక
- పోలీసు శాఖను అభినందించిన మంత్రి పువ్వాడ



జాబ్ మేళాలో పాల్గొనేందుకు పేర్లు నమోదు చేసుకుంటున్న యువత

ఖమ్మం మయూరిసెంటర్: నిరుద్యోగులకు ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా పోలీసు శాఖ ఆధ్వర్యాన ఖమ్మంలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళా విజయవంతమైంది. సుమారు 8వేల మందికి ఉపాధి కల్పించడమే లక్ష్యంగా 150 కంపెనీల బాధ్యులను ఆహ్వానించారు. కొద్దిరోజులుగా పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ ఆధ్వర్యాన ఏర్పాట్లు చేస్తూ జిల్లా వ్యాప్తంగా పోలీసుస్టేషన్లలో ప్రత్యేక కేంద్రాల ద్వారా దరఖాస్తులు స్వీకరించారు. ఈమేరకు ఎస్సెస్సీ మొదలు ఇంజనీరింగ్ వరకు పూర్తిచేసిన 15వేల మందికి పైగా యువతీ, యువకులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం ఖమ్మంలోని ఎస్‌బీఐటీలో నిర్వహించిన జాబ్‌మేళాలో కంపెనీల బాధ్యులు పాల్గొని ఇంటర్వ్యూ ద్వారా ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఇందులో మొత్తంగా 8,025 మందిని ఎంపిక చేసినట్లు అధికారులు వెల్లడించగా... 5,025 మందికి అక్కడికక్కడే నియామక పత్రాలు అందజేశారు. మిగతా వారికి రెండు, మూడు రోజుల్లో నియామక పత్రాలు ఇస్తామని కంపెనీల బాధ్యులు చెప్పారు. దీంతో యువతీ యువకులు పోలీసు శాఖకు, కంపెనీల బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

టీం వర్క్‌గా పని చేశాం..

మెగా జాబ్ మేళా విజయవంతానికి జిల్లా పోలీస్ యంత్రాంగమంతా కష్టపడిందని ఖమ్మం సీపీ విష్ణు ఎస్.వారియర్ తెలిపారు. పదిహేను రోజులుగా హోంగార్డు నుండి అధికారుల వరకు అందరూ చేసిన కృషి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సలహాలతో మేళాను విజయవంతం చేశామని చెప్పారు. ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ యువత మొదటి ఉద్యోగంలో వచ్చే వేతనమెంత అనేది చూసుకోకుండా అనుభవం సాధించేందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. యువత కోసం భారీ స్థాయిలో మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసిన సీపీ అభినందనీయులని అన్నారు. ఎస్‌బీఐటీ విద్యాసంస్థల చైర్మన్ గుండాల కృష్ణ, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ, జెడ్పీ, సుడా చైర్మన్లు కూరాకుల నాగభూషణం, లింగాల కమల్ రాజు, విజయ్‌కుమార్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్ పాల్గొన్నారు.

భారీగా తరలి వచ్చిన యువత

పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా జాబ్‌మేళాలో పాల్గొనేందుకు ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి, సూర్యాపేట జిల్లాల నుంచి కూడా యువత తరలివచ్చారు. ఉదయం 9 గంటల నుంచే అభ్యర్థులు బారులు దీరగా, సాయంత్రం 6 గంటల వరకు 150 కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులను ఇంటర్వ్యూ చేసి అర్హులను ఎంపిక చేసుకున్నారు. పది వేల మందికి పైగా ఇంటర్వ్యూలకు హాజరు కాగా 8,025 మందిని ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, పేర్ల నమోదు మొదలు చివరి వరకు అన్ని ఏర్పాట్లు చేసిన పోలీసులు.. ఎండ కారణంగా ఇబ్బంది పడకుండా తాగునీరు, మజ్జిగ, షామియానాలతో పాటు వైద్యసౌకర్యం కోసం అంబులెన్స్, వైద్యసిబ్బందిని నియమించారు. అలాగే, చంటిపిల్లల తల్లులు, గర్భిణులు మొదట వెళ్లేలా వెసులుబాటు కల్పించారు.

అవకాశాలు అందిపుచ్చుకోవాలి : మంత్రి పువ్వాడ



మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్, పక్కన ఖమ్మం కలెక్టర్, సీపీ తదితరులు

ఉపాధి అవకాశాల కోసం యువత వేసే మొదటి అడుగు విలువైనదని.. ఈ సమయంలో వచ్చే ప్రతీ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే మెరుగైన భవిష్యత్ ఉంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. మెగా జాబ్‌మేళాను ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖ ప్రతిష్టాత్మకంగా తీసుకుని 8 వేలకు పైగా ఉపాధి అవకాశాలు కల్పించేలా జాబ్‌మేళా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందరూ ప్రభుత్వ ఉద్యోగం పొందడం సాధ్యం కాదని, అలాంటి వారికోసం నిర్వహించే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పోలీస్ శాఖ తరఫున శాంతిభద్రతలు కాపాడుతూనే నిరుద్యోగులకు ఉపాధి కల్పించేలా జాబ్‌మేళా నిర్వహణకు అహర్నిశలు శ్రమించిన పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకెళ్తున్న కలెక్టర్ గౌతమ్, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ సురభిని మంత్రి అభినందించారు. అనంతరం అమెజాన్ వేర్‌హౌస్ విభాగంలో ఉద్యోగం పొందిన వెల్లాపుల ప్రణయ్, ఖమ్మం ఐటీ హబ్‌లోని సోవారి కంపెనీలో ఉద్యోగం పొందిన జి.విహారి, నెల్లూరి కావ్య, ఎస్‌హెచ్ఐ యూత్ జాబ్స్‌లో ఉద్యోగం పొందిన కాకర్లమూడి నితిన్‌కు మంత్రి నియామకపత్రాలు అందజేశారు.

ఆనందంగా ఉంది..



పోలీసు శాఖ నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. సొంత జిల్లా అయిన ఖమ్మం ఐటీ హబ్‌లోనే ఉద్యోగం దొరకడం నాకు మంచి అవకాశంగా భావిస్తున్నా. ఇంత భారీ జాబ్‌మేళా ఏర్పాటుచేసిన పోలీసు శాఖకు ధన్యవాదాలు.

– జి.విహారి, ఖమ్మం

అనుకోకుండా వచ్చా..



స్నేహితులంతా దరఖాస్తు చేసుకుంటుంటే నేనూ పేరు నమోదు చేసుకున్నా. అమెజాన్ వేర్‌హౌస్‌లో ఇంటర్వ్యూకు హాజరైతే రూ.2.50 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగం వచ్చింది. మంత్రి చేతుల మీదుగా నియామక పత్రం అందకోవడం సంతోషంగా ఉంది.

– వెల్లాపుల ప్రణయ్, దోర్నకల్

మెగా జాబ్‌మేళా చరిత్రాత్మకం



నేను చాలా జాబ్ మేళాలకు హాజరైనా ఇంత పెద్ద మేళా చూడలేదు. ఖమ్మంలో ఒకే వేదికపైకి 150 కంపెనీలను తీసుకురావడం చరిత్రాత్మకం. జిల్లా యువతలో భరోసా నింపేలా పోలీసులు కృషి చేశారు. వేలాది మంది ఉపాధి పొందే అవకాశం కల్పించారు.

– సుధ, ఖమ్మం

క్లుప్తంగా

పీఆర్ ఎస్ఈకి కొత్తగూడెం ఈఈగా బాధ్యతలు

ఖమ్మంసహకారనగర్: ఖమ్మం పంచాయతీ రాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్ఈ) సుదర్శన్‌కు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెం పీఆర్ ఈఈగా బాధ్యతలు అప్పగించారు. అక్కడి ఈఈ సుధాకర్ వ్యక్తిగత కారణాలతో ఇటీవల రాజీనామా చేశారు. దీంతో ఆ పోస్టు భర్తీ చేయాల్సి ఉన్న క్రమాన తాత్కాలికంగా సుదర్శన్‌కు బాధ్యతలు అప్పగించగా ఆయన విధుల్లో చేరారు.

అక్షర చిట్‌ఫండ్ బాధ్యులపై కేసు నమోదు

కొత్తగూడెంఅర్బన్: చీటీ పాడుకుని ఏడు నెలలు గడుస్తున్నా డబ్బులు ఇవ్వకపోవడంతో కొత్తగూడెం నేతాజీ మార్కెట్‌కు చెందిన లక్ష్మణ్ అగర్వాల్ చేసిన ఫిర్యాదు మేరకు అక్షర చిట్ ఫండ్స్ బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు కొత్తగూడెం త్రీటౌన్ సీఐ అబ్బయ్య ఆదివారం వెల్లడించారు. నేతాజీనగర్‌కు చెందిన లక్ష్మణ్ సెవెన్‌హిల్స్ ఏరియాలోని అక్షర చిట్‌ఫండ్‌లో 2018లో నెలకు రూ.50 వేల చొప్పున కట్టేలా చీటీలో చేరాడు. 2022 సెప్టెంబర్‌లో చీటీ పాడిన ఆయన డబ్బుల కోసం ఏడు నెలల పాటు తిరిగినా మేనేజర్, ఉద్యోగులు పట్టించుకోలేదు. తమకు సంబంధించి భూమి అమ్మాక డబ్బులు ఇస్తామని కాలయాపన చేస్తుండడమే కాక, తరచుగా వస్తే పెట్రోల్ పోసి చంపుతామని బెదిరించినట్లు లక్ష్మణ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎస్పీ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు అందజేయగా చర్యలు తీసుకోవాలని త్రీటౌన్ పోలీసులను ఆదేశించారు. దీంతో బ్రాంచ్ పాత మేనేజర్ వినీత్, ప్రస్తుత మేనేజర్ అనిల్(కొత్తగూడెం), ఆర్ఎం మనీశ్ (భద్రాచలం), ఎండీ కొండల్‌రావు(ఖమ్మం), చైర్మన్ శ్రీనివాస్(వరంగల్)పై కేసు నమోదు చేసినట్లు సీఐ అబ్బయ్య తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

ఇల్లెందు: కట్టుకున్న భర్త, అత్త, మామ, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఓ వివాహిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఇల్లెందు జేకే కాలనీకి చెందిన కల్యాణిని కొత్తగూడెం రుద్రంపూర్‌కు చెందిన పృథ్వీకి ఇచ్చి 2001లో వివాహం చేశారు. వారికి ఒక పాప కూడా ఉంది. అదనపు కట్నం కోసం పృథ్వీ కుటుంబ సభ్యులు వేధిస్తుండగా తాళలేక కల్యాణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. విచారణ జరిపిన ఎస్ఐ రాజేశ్ కల్యాణి భర్త పృథ్వీతో పాటు అత్త, మామ, ఆడపడుచు మీద కేసు నమోదు చేశారు.

ఇద్దరిపై కేసు

పాల్వంచరూరల్: ఓ వ్యక్తిని చంపుతానని బెదిరించిన ఇద్దరిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. మండలంలోని తోగ్గూడెం గ్రామానికి చెందిన జర్పుల జయ కుమార్తె దివ్యను జగన్నాథపురం గ్రామానికి చెందిన శ్రీరామ్ కొంతకాలంగా ప్రేమిస్తున్నానని వేధిస్తున్నాడు. దీంతో దివ్యకు టేకులపల్లి మండలం గోలియా తండాకు చెందిన కిరణ్‌కుమార్‌తో ఈనెల 6న వివాహం జరిపించారు. అయితే, పెళ్లిపందిట్లోకి వచ్చిన శ్రీరామ్ తన అల్లుడు కిరణ్‌కుమార్‌ను చంపుతానని బెదిరించాడని జయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు శ్రీరామ్‌తోపాటు అతడి తల్లి నీలాపై కూడా కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

ఇరు వర్గాలపై కేసు

అశ్వారావుపేటరూరల్: ఇరు వర్గాలపై ఆదివారం రాత్రి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఎస్ఐ రాజేశ్‌కుమార్ కథనం ప్రకారం.. స్థానిక తూర్పుబజారుకు చెందిన సువర్ణ సావణ్య ఇంట్లోకి ఇదే ప్రాంతానికి చెందిన కిరణ్, నల్లబోతుల రాజా, నల్లబోతుల శ్రీను వచ్చి ఆమెతో పాటు భర్త మురళి, తల్లి, కుమార్తెలను దుర్భాషలాడారు. దీంతో సావణ్య లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా ఆ ముగ్గురిపై కేసు నమోదైంది. అలాగే సువర్ణ మురళీ అనే వ్యక్తి తన గురించి దుష్ప్రచారం చేస్తున్నాడని, ఈ విషయం గురించి ప్రశ్నించేందుకు వెళ్లిన కిరణ్, రాజా, శ్రీనులపై దాడికి పాల్పడినట్లు నల్లబోతుల జ్యోతి ఫిర్యాదు చేసింది. దీంతో మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

జూదరుల అరెస్ట్

ములకలపల్లి: గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని మాధారం అటవీ ప్రాంతంలో పేకాట స్థావరం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే వారు దాడులు నిర్వహించి, ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రూ.3,500 నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి దార్యప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు


గాయపడిన ప్రభాకర్‌రావు

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్‌ను లారీ ఢీకొట్టిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం కాలనీ వద్ద సత్తుపల్లి వైపు నుంచి వేగంగా వచ్చిన ఓ లారీ.. వెనుక నుంచి ట్రాక్టర్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌పై ఉన్న నారంవారిగూడెం పంచాయతీ బురుగుగుంపు గ్రామానికి చెందిన సంగా ప్రభాకర్‌రావు తీవ్ర గాయాలపాలు కాగా, గమనించిన స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా, హైవేపై ఉన్న బారికేడ్లను కొంతమంది దుకాణాదారులు తొలగించడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఓపెన్ జిమ్‌లపై ఫోకస్..

- పాల్వంచ, కొత్తగూడెంలలో డీఎంఎఫ్ నిధులతో అభివృద్ధి
- పార్కుల్లో జిమ్‌లతో పాటు పచ్చదనానికి పెద్దపీట


బొల్లేరుగూడెం మున్సిపల్ పార్క్‌లో జిమ్ చేస్తున్న స్థానికులు

పాల్వంచ: మున్సిపాలిటీల్లో ఓపెన్ జిమ్‌లను అభివృద్ధిపర్చే దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా డీఎంఎఫ్ నిధులను కేటాయించేలా ప్రణాళికలు రూపొందించారు. ఈ నిధులతో ఇప్పటికే వివిధ మున్సిపల్ పార్కుల్లో ఉన్న ఓపెన్ జిమ్‌లను మరింత తీర్చిదిద్దడంతో పాటు, కొత్తగా ఏర్పాటు చేసిన పార్కుల్లోనూ జిమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ జిమ్‌లను పట్టణ వాసులు సద్వినియోగం చేసుకుంటున్నారు. పిల్లలు మొదలు యువత, వృద్ధుల వరకు ఈ జిమ్‌లలో గడుపుతున్నారు. తద్వారా శారీరక, మానసిక ఆరోగ్యానికి ఈ జిమ్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ప్రజలు చెబుతుండటంతో ఓపెన్ జిమ్‌లను అభివృద్ధి పర్చేందుకు అధికారులు నడుం బిగించారు.

కొత్త పార్కుల్లోనూ..

పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీల్లో ఇప్పటికే పట్టణ ప్రగతిలో భాగంగా ఓపెన్ జిమ్‌లను వివిధ మున్సిపల్ పార్కుల్లో ఏర్పాటు చేశారు. పాల్వంచలోని బొల్లేరుగూడెం, జ్యోతినగర్, ఇందిరాకాలనీలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం బూడిదగడ్డ, రాజీవ్‌పార్క్, విశ్వనాథకాలనీ పార్క్, రైటర్‌బస్తీలోని పార్కుల్లో జిమ్‌లు ఉన్నాయి. రూ.6 లక్షల నుంచి రూ.15 లక్షల వ్యయంతో ఆయా జిమ్‌లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ జిమ్‌లను ప్రజలు అత్యధికంగా వినియోగించుకుంటున్నారు. కాగా, పాల్వంచలో డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ కింద రూ.2 కోట్ల వ్యయంతో నవభారత్ హర్షటౌన్ షిప్, శ్రీనివాస కాలనీ, కరకవాగు, నవభారత్, గట్టాయిగూడెం, హమాలీకాలనీ తదిత ఏరియాల్లో ఉన్న పార్కుల్లో జిమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా ఈ నిధులతో పార్కుల్లో పచ్చదనాన్ని పెంపొందించే చర్యలు చేపట్టనున్నారు. అదేవిధంగా జిమ్ పరికరాలు, స్వాగత ఆర్చ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించారు. కొత్తగూడెంలో బూడిద గడ్డ, గంగబిషన్ బస్తీ, రామవరంలోని పలు ప్రాంతాల్లో ఓపెన్ జిమ్‌ల కోసం ప్రతిపాదనలు చేశారు.

ఓపెన్ జిమ్‌లను తీర్చిదిద్దనున్నాం..



మున్సిపాలిటీల్లో ఇప్పటికే ఓపెన్ జిమ్‌లను ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి ఆదరణ దృష్ట్యా పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో భాగంగా కొత్తగా ఏర్పాటు చేసిన మున్సిపల్ పార్కుల్లో కూడా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేయనున్నాం. దీంతోపాటు పచ్చదనానికి మరింత ప్రాముఖ్యత కల్పించనున్నాం. ఆహ్లాదభరితంగా ఉండేలా చూస్తాం. డిస్ట్రిక్ మినరల్ ఫండ్ నిధులతో అభివృద్ధి చేపట్టనున్నాం.

– సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్

27న ఖమ్మంలో నిరుద్యోగ మార్చ్

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ


మాట్లాడుతున్న కోనేరు సత్యనారాయణ పక్కన నాయకులు

ఇల్లెందు: తెలంగాణ ఏర్పాటు తర్వాత రెండుసార్లు అధికారంలోకి వచ్చిన కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగ నియామకాలు సక్రమంగా చేపట్టలేదని, దీంతో నిరుద్యోగులకు తీవ్ర నష్టం జరిగిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోనేరు సత్యనారాయణ ఆరోపించారు. ఆదివారం ఆయన ఇల్లెందులో విలేకరులతో మాట్లాడారు. ఈ అన్యాయాన్ని బట్టబయలు చేసేందుకు ఈ నెల 27న ఖమ్మంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నిర్వహించ తలపెట్టిన నిరుద్యోగ మార్చ్‌ను విజయవంతం చేయాలని నిరుద్యోగులు, యువతకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పల్లె నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు నిరుద్యోగుల ఆందోళనలు కొనసాగుతున్నాయని, అయినా రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఇప్పటివరకు జరిగిన అన్ని పబ్లిక్ పరీక్షల్లో పేపర్ల లీకేజీలు ఈ ప్రభుత్వ ఘనతగా మారిందని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ లీకేజీలకు కారకులను శిక్షించటంలో ప్రభుత్వం విఫలమైందని, లీకేజీకి కారకులైన కేటీఆర్‌ను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లీకేజీలపై సిట్టింగ్ జడ్జిచే విచారణ జరిపించాలని కోరారు. పరీక్షల కోచింగ్‌లతో నష్టపోయిన నిరుద్యోగులకు లక్ష పరిహారం చెల్లించాలని కోరారు. అవినీతిమయమైన ఎమ్మెల్యేల గుట్టు రట్టు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ తన బిడ్డ కవితను కాపాడుకునేందుకు చూపిన శ్రద్ధ పరీక్షల మీద చూపటం లేదని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాలగాని గోపీకృష్ణ, నాయకులు గుగులోతు రాంచందర్, భూక్యా శ్రీనివాస్, హతీరాంనాయక్, బాలాజీ, జర్పుల రాంచందర్, రామారావు, ఈసం వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, రజత్‌కోరీ, రాహుల్ ఉన్నారు.

ఘనంగా ఆంజనేయుడి విగ్రహ ప్రతిష్ఠాపన


ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు


ముస్లింల ఆధ్వర్యంలో మజ్జిగ అందిస్తున్న సాబీర్‌పాషా

గుండాల: ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఆదివారం 24 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు సనత్, లక్ష్మణాచార్యులు, రామాచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. శ్రీనివాసగుప్తా భక్త బృందం హనుమాన్ చాలీసా పఠించి భజనలు చేయగా పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ముస్లింలు మత సామరస్యాన్ని పాటిస్తూ అందరికీ మజ్జిగ, మంచి నీరు అందించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఇల్లెందు డీఎస్పీ రమణమూర్తి, టేకులపల్లి సీఐ ఇంద్రసేనారెడ్డి, పినపాక ఎమ్మెల్యే సతీమణి రేగా సుధారాణి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, ఎంపీపీ కొండ్రు మంజుభార్గవి, జెడ్పీటీసీ హన్మంతుతోపాటు రేసు ఎల్లయ్య, కోటేశ్వరరావు, రేవంత్, రతీశ్, అరుణ్‌కుమార్, వినోద, గౌరిశెట్టి శ్రీనివాసరావు, వజ్రం, అబ్బు నాగేశ్వర్‌రావు, అనుమోలు నాగేశ్వర్‌రావు, నరెడ్ల వెంకన్న, తెలగాని శ్రీనివాస్, శ్రీరాం సమ్మయ్య, మహమ్మద్ అతహర్, హఫీజ్, ఖయ్యూం, ఆరిఫ్, ముక్తార్ పాషా, భిక్షం, ముక్తి లింగం, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నాటక రంగానికి జవసత్వాలు

'నెలనెలా వెన్నెల'లో సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకట వీరయ్య, (ఇన్‌సెట్) కలిసి ఉంటే నాటికలోని సన్నివేశం

ఖమ్మంగాంధీచౌక్: కనుమరగవుతున్న నాటక రంగానికి జవసత్వాలు నింపుతున్న సాంస్కృతిక సంస్థల బాధ్యులు అభినందనీయులని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కొనియాడారు. ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో అమరజీవి అన్నాబత్తుల రవీంద్రనాథ్ కళా సాంస్కృతిక సంస్థ(ఆర్క్స్)ఆధ్వర్యాన ఆదివారం రాత్రి నెలనెలా వెన్నెల కార్యక్రమం జరిగింది. ప్రజా నాట్యమండలి, ఖమ్మం కళా పరిషత్ సహకారంతో నిర్వహించిన ఈకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వెంకటవీరయ్య మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో సినిమాలకే ఆదరణ దక్కడం లేదని.. అలాంటిది కళారంగాన్ని బ్రతికించటం కోసం చేస్తున్న కృషి మరువలేనిదన్నారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో సౌకర్యాల కల్పనకు తన సహకారం ఉంటుందని తెలిపారు. ఆర్క్స్ సంస్థ అధ్యక్షుడు మోటమర్రి జగన్మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఖమ్మం కళా పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగబత్తిని రవి, డాక్టర్ వేల్పుల విజేతతో పాటు కాళ్ల కృష్ణమోహన్, కొదుమూరి లక్ష్మణమూర్తి, మారుతి కొండల్‌రావు, నామా లక్ష్మీనారాయణ, నందిగామ కృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన 'కలిసి ఉంటే' నాటిక

విశాఖపట్నంకు చెందిన భద్రం ఫౌండేషన్ ఆధ్వర్యాన ప్రదర్శించిన 'కలిసి ఉంటే' హాస్య నాటిక ప్రేక్షకులను అలరించింది. ఎస్.దేవిరాజు రచించిన దర్శకత్వంలో వహించిన ఈ నాటికలో బగధి విజయసాయి, మొహిద్దీన్, ఎం.శివజ్యోతి, మల్లిక కుమారి, డేవిడ్‌రాజ్ వివిధ పాత్రలను పోషించారు. అలాగే, అమర్లపూడి శ్వేతవర్షిణి కూచిపూడి నృత్యం, అభినయ రుద్ర నాట్యాలయం చిన్నారుల భరత నాట్యం అలరించాయి. ఇంకా ఈ కార్యక్రమంలో మాధవ్, చందు, కుమారి, విజయసాయి, మొగిలి గుణాకర్ పాల్గొన్నారు.

కర్ణాటకతోనే బీజేపీ పతనం ప్రారంభం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు


చింతకాని : కొదుమూరులో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు

చింతకాని/బోనకల్: కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాలతోనే బీజేపీ పతనం ఆరంభమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. వచ్చేనెల 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యాన ప్రజాగర్జన జరగనున్న నేపథ్యాన చింతకాని మండలం కొదుమూరు, బస్వాపురం, నాగిలిగొండ, నేరడ, ప్రొద్దుటూరు, బోనకల్ మండలంలోని కలకోట, బ్రాహ్మణపల్లి, రాపల్లి, ఆళ్లపాడు, రాయన్నపేట, బోనకల్‌లో ఆదివారం పర్యటించిన ఆయన పార్టీ కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ప్రజలను దగా చేస్తున్న అసమర్థ బీజేపీ ప్రభుత్వాన్ని తక్షణమే గద్దె దించాల్సిన అవసరముందన్నారు. మోదీ పాలనలో అవినీతి, అక్రమార్కులు పెరిగిపోగా, కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. వచ్చేఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఇవే ఫలితాలు పునరావృతం అవుతాయని ఆయన చెప్పారు. కాగా, కొత్తగూడెంలో నిర్వహించే ప్రజాగర్జనకు వేలాదిగా కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాల్లో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు రంగారావు, నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు, షేక్ జానీమియా, ఏపూరి రవీంద్రబాబు, పావులూరి మల్లికార్జున్‌రావు, దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, రాసాల మోహన్‌రావు, కూచిపూడి రవి, మార్గం శ్రీను, నక్కనబోయిన కృష్ణ, చల్లగుండ్ల వెంకటేశ్వర్లు, సతీష్, రామాంజనేయులు, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు


కామేపల్లిలోని షాపులో తనిఖీ చేస్తున్న అధికారులు

వైరా/తల్లాడ/ఏన్కూరు/కారేపల్లి: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విత్తన దుకాణాల్లో రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ బృందం ఆదివారం తనిఖీలు చేపట్టింది. ఈ సందర్భంగా వైరాలోని నాగార్జున ఆగ్రోస్ విత్తన దుకాణంలో ఏడీఏ ఆర్.శివానంద్ నేతృత్వాన పోలీస్, వ్యవసాయ శాఖ ఉద్యోగులు వెంకటేశ్వరరావు, వేణుమాధవ్, రాజు పరిశీలించారు. పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలించి పరీక్షలు నిర్వహించారు. ఈ తనిఖీ ల్లో ఏఓ పవన్‌కుమార్ కూడా పాల్గొన్నారు. ఇక తల్లాడలోని పలు షాపుల్లో తనిఖీలు చేపట్టిన బృందం స్టాక్ బోర్డు ఏర్పాటు, విక్రయాలు, రశీదులపై అవగాహన కల్పించారు. ఏఓలు తాజుద్దీన్, ఏఓ రాజు, ఏఎస్సై శ్రీనివాసచారి పాల్గొన్నారు. ఏన్కూరు మండలం తిమ్మారావుపేట,ఏన్కూరు గ్రామాల్లో కూడా తనిఖీ చేపట్ట గా ఉద్యోగులు కె.శ్రీనివాసచారి, కె.రాజు, ఎ.నర్సింహారావు పాల్గొన్నారు. కాగా, కామేపల్లిలోని విత్తన షాపుల్లో శివానంద్ ఆధ్వర్యాన తనిఖీలు చేశారు. వ్యవసాయ పోలీసు శాఖ ఉద్యోగులు ఏ.శ్రీనివాసరావు, టి.వెంకటేశ్వర్లు, కె.శ్రీని వాసాచారి, తారాదేవి, జగదీశ్వర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి


రామలక్ష్మి(ఫైల్)

కల్లూరు రూరల్: మండలంలోని ముచ్చవరం గ్రామపంచాయితీ పరిధి బాలాజీనగర్‌కు చెందిన మహిళ ఆదివారం విద్యుదాఘాతంతో మృతి చెందింది. బాలాజీనగర్‌కు చెందిన చింతపల్లి రామలక్ష్మి(45) ఆదివారం ఇంటి ఆవరణను శుభ్రం చేసే క్రమాన మోటారు పక్కన బైండింగ్ వైర్‌ను పక్కకు జరుపుతుండగా షాక్‌కు గురైంది. దీంతో ఆమెను కాపాడే యత్నంలో భర్త సత్యనారాయణ కూడా షాక్‌కు గురయ్యాడు. అయితే, అపస్మారక స్థితిలోకి వెళ్లిన రామలక్ష్మి మృతి చెందింది.

రైలుకింద పడి వ్యక్తి మృతి

మధిర: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి(50) మృతి చెందాడు. తొండలగోపవరం, ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ల మధ్య కట్టలేరు రైల్వే బ్రిడ్జి సమీపాన ఆదివారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. మృతుడి కుడి చేతిపై కృష్ణభగవానుడి పచ్చబొట్టు ఉందని, ఆచూకీ తెలిసిన వారు 99636 41484 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్‌బోల్తా : బాలుడు మృతి


బాలవెంకట గణేశ్ (ఫైల్)

చంద్రుగొండ: మండలంలోని పోకలగూడెం - రావికంపాడు గ్రామాల మధ్య రోడ్డు మూలమలుపు వద్ద ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో ఆళ్లకుంట బాలవెంకటగణేశ్ (14) మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని అయన్నపాలెం గ్రామానికి చెందిన ఆళ్లకుంట కృష్ణ, మహాలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. అందులో బాలవెంకటగణేశ్ ఇటుకలు మోసేందుకు ముఠాతోపాటు కలిసి వెళ్లాడు. అయన్నపాలెంలో ఇటుకలబట్టి నుంచి ట్రాక్టర్‌పై లోడు వేసుకుని పోకలగూడెం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మలుపువద్ద అదుపుతప్పిన ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో ఇంజన్‌పై డ్రైవర్ పక్కన కూర్చున్న బాలుడు ఇంజన్ కిందపడ్డాడు. వెంటనే గ్రామస్తులు జేసీబీతో ట్రాక్టర్ ఇంజన్‌ను తొలగించి బాలుడిని తీశారు. తీవ్రంగా గాయపడిన బాలుడిని కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బాలుడి మృతితో కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గొల్లపల్లి విజయలక్ష్మి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని నాగుపల్లి గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కొమరంముత్యాలగుంపు గ్రామానికి చెందిన దారెబోయిన నాగేంద్రబాబు (30), సున్నం నాగరాజు బైక్‌పై నిత్యావసరాల కోసం సత్తుపల్లి వెళ్లి తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో నాగుపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల సమీపంలో గేదె దూడను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రులను సత్తుపల్లి ఆస్పత్రికి తరలించగా నాగేంద్రబాబు మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి గుర్తింపు

పాల్వంచరూరల్: మండలంలోని జగన్నాథపురం శివారులోని వైకుంఠధామం ఎదుట జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని శనివారం మృతిచెందిన వ్యక్తి ఆచూకీ లభించింది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా జంగిలిగొండ కొత్తూరు గ్రామానికి చెందిన దారపు యాకన్న (35) శనివారం సారపాకలో ఉన్న తమ సమీప బంధువుల ఇంటికి వెళ్తున్న క్రమంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందాడు. మృతుదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో నలుగురికి తీవ్రగాయాలు

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం పాతలింగాల స్టేజీ సమీపాన రెండు మోటర్‌సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గోవింద్రాల బంజరకు చెందిన బానోత్ బానోత్ బాన్యా, గుగులోత్ నరేష్, సిద్దూ మోటర్‌సైకిల్‌పై ముచ్చర్లలో జరుగుతున్న శుభకార్యానికి ఆదివారం బయలుదేరారు. ఈక్రమంలో కొత్తలింగాల వైపు నుంచి డోర్నకల్ వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలుర వసతిగృహానికి అమ్మాయి

విద్యార్థి అడ్మిషన్ రద్దు చేసిన అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ కళాశాల వసతిగృహాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందనడానికి ఇది మరో ఉదాహరణ. వసతిగృహాల్లో విద్యార్థుల చదువు, ప్రవర్తనపై దృష్టి సారించాల్సిన అధికారులు ఆ బాధ్యతలు విస్మరిస్తుండడంతో కొన్నిచోట్ల విద్యార్థులు ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారు. ఇటీవల ఖమ్మంలోని ఓ సంక్షేమ శాఖ బాలుర కళాశాల వసతిగృహంలోకి విద్యార్థులు అమ్మాయిని తీసుకొచ్చిన విషయం ఆలస్యంగా వెలుగుచూసింది. విద్యార్థులతో కలిసి వచ్చిన అమ్మాయితో ఓ విద్యార్థి గదిలో ఉండగా.. మిగతా వారు బయట తాళం వేసి వెళ్లినట్లు సమాచారం. దీంతో గమనించిన వాచ్‌మెన్ వసతిగృహ సంక్షేమ అధికారి దృష్టికి తీసుకెళ్లగా ఆయన చేరుకుని గదిలో ఉన్న వారిని బయటకు పంపించాడు. ఈ ఘటనపై విచారణ జరిపిన అధికారులు గదిలో అమ్మాయితో ఉన్న విద్యార్థి అడ్మిషన్‌ను రద్దు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా విద్యార్థులు అమ్మాయిని తీసుకొచ్చిన విషయం తమ దృష్టికి రాగానే విద్యార్థి అడ్మిషన్ రద్దు చేసి పంపించినట్లు తెలిపారు.

బ్రేకర్ కాలిపోవడంతో రూ.5లక్షల నష్టం

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ఖానాపురంలోని 130 కేవీ సబ్‌స్టేషన్‌లో బ్రేకర్ ఆదివారం మధ్యాహ్నం కాలిపోయింది. దీంతో నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ మేరకు అధికారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో సరఫరా చేస్తూనే, బ్రేకర్ మరమ్మతులు చేపట్టారు. అధిక ఉష్ణోగ్రతల ప్రభావంతో ఇలా జరిగిందని, ఈ ఘటనతో రూ.5 లక్షల విలువైన పరికరాలు కాలిపోయాయని విద్యుత్‌శాఖ ఏడీ, ఏఈలు రమేష్, అశోక్ తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన బ్రేకర్ మరమ్మతులు చేపట్టినట్లు వారు వివరించారు.

బందరు పోర్టు పనులకు
నేడే శుభారంభం

- రూ.5,156 కోట్లతో నిర్మాణ పనులకు సీఎం జగన్ భూమిపూజ

సాక్షి, అమరావతి/సాక్షి ప్రతినిధి, విజయవాడ: మచిలీపట్నం ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తూ రూ.5,156 కోట్ల వ్యయంతో చేపడుతున్న పోర్టు నిర్మాణ పనులను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ప్రారంభించనున్నారు. భూసేకరణ పూర్తిచేసి, అన్ని అనుమతులు సాధించి, న్యాయ వివాదాలు పరిష్కరించి, టెండర్లు ఖరారుచేసి, ఫైనాన్షియల్ క్లోజర్ పూర్తిచేసి కొబ్బరికాయ కొట్టిన తర్వాత పనులు ఆగకుండా శరవేగంగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికను సిద్ధంచేసింది. పూర్తిగా ప్రభుత్వ వ్యయంతో నిర్మిస్తున్న ఈ పోర్టు రాకతో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించి రానున్న కాలంలో కృష్ణాజిల్లా ముఖచిత్రం మారనుంది. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో నవశకానికి నాంది పలుకుతూ అధికారంలోకి వచ్చిన కేవలం నాలుగేళ్ల లోపే మరో నాలుగు పోర్టుల నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. ఇప్పటికే రామాయపట్నం, కాకినాడ గేట్‌వే పోర్టుల్లో పనులు శరవేగంగా జరుగుతుండగా, మూలపేట పోర్టు పనులు కూడా ఇటీవలే ప్రారంభమయ్యాయి. ఇక సోమవారం నుంచి ఈ జాబితాలో మచిలీపట్నం పోర్టు కూడా చేరనుంది. 35.12 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో రెండు జనరల్ కార్గోకు, ఒకటి బొగ్గుకు, మరొకటి మల్టీపర్పస్-కంటైనర్‌తో ఎగుమతి, దిగుమతులకు ఉపయోగపడేలా మొత్తం నాలుగు బెర్తులతో మచిలీపట్నం పోర్టును 24–30 నెలల్లో పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పోర్టు పనుల పూర్తితో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25వేల మందికి ఉపాధి లభించనుంది. ఈ పోర్టు ద్వారా రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణలోని ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ, వరంగల్ జిల్లాలకు ఎరువులు, బొగ్గు, వంటనూనె, కంటైనర్ల దిగుమతులు, వ్యవసాయ ఉత్పత్తులు, సిమెంట్, సిమెంట్ క్లింకర్, గ్రానైట్, ముడి ఇనుము ఎగుమతులకు వేదికగా మారనుంది. సుమారు రూ.16,000 కోట్ల వ్యయంతో రామాయపట్నం, మచిలీపట్నం, కాకినాడ గేట్‌వే, మూలపేట పోర్టుల నిర్మాణాల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 75 వేల మందికి ఉపాధి లభించనుంది.


పోర్టు నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భూమిపూజ చేసే ప్రాంతం



శరవేగంగా పూర్తవుతున్న జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్

ఏపీ ప్రభుత్వ కృషికి అవార్డుతో జాతీయ స్థాయిలో గుర్తింపు
మూడు ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

- కొత్తగా 4 పోర్టు నగరాలు రామాయపట్నం, మూలపేట, కాకినాడ, బందరు
- వీటికి అదనంగా మినీ పోర్టుల తరహాలో తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- పోర్టులను ఆనుకుని పారిశ్రామిక పార్కుల అభివృద్ధి
- పరిశ్రమలకు 80% ఉత్పత్తి వ్యయం తగ్గేలా రూ.18,897 కోట్లు వెచ్చిస్తున్న సర్కార్
- అనుమతులు, ఆర్థిక వనరులు సిద్ధమయ్యాకే పక్కాగా పనులు ప్రారంభం
- మూడు పారిశ్రామిక కారిడార్లు కలిగిన ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ రికార్డు
- ప్రభుత్వ తోడ్పాటుతో రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకొస్తున్న దిగ్గజ కంపెనీలు
- విశాఖ గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో రూ.13.11 లక్షల కోట్ల పెట్టుబడులే నిదర్శనం

సాక్షి, అమరావతి: పారిశ్రామిక మౌలిక వసతుల కల్పనలో ఏపీ వేగంగా దూసుకెళుతోంది. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్లతోపాటు 974 కి.మీ సుదీర్ఘ తీర ప్రాంతాన్ని కలిగి ఉండటం లాంటి అనుకూలతలను అందిపుచ్చుకుంటూ పురోగమిస్తోంది. విద్యుత్, నీరు, రోడ్లు, లాజిస్టిక్స్‌తో పాటు వివాద రహితంగా అభివృద్ధి చేసిన భూములను సమకూర్చడం ద్వారా పెట్టుబడులను ఆకర్షించేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో తీసుకున్న నిర్ణయాలు సత్ఫలితాలనిస్తున్నాయి. పారిశ్రామిక రాయితీలతోపాటు మౌలిక వసతులపై అధికంగా దృష్టిసారించాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించిన సీఎం జగన్ కోవిడ్ సంక్షోభ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ చర్యలు తీసుకున్నారు. రాష్ట్రం గుండా వెళ్తున్న మూడు పారిశ్రామిక కారిడార్లు విశాఖ-చెన్నై, చెన్నై-బెంగళూరు, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లలో రూ.11,753 కోట్లతో ఆరు పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేయడంతో పాటు రూ.18,897 కోట్లతో నాలుగు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాన్ని కోవిడ్ సమయంలో ఏకకాలంలో చేపట్టారు. అంతేకాకుండా విశాఖ, అనంతపురంలో మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల నిర్మాణాన్ని చేపట్టడమే కాకుండా కొప్పర్తి, ఓర్వకల్లు వద్ద మరో రెండు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల కోసం ప్రతిపాదనలు పంపారు. మరోవైపు కాకినాడ వద్ద రూ.1,000 కోట్లతో బల్క్‌డ్రగ్ పార్క్‌ను అభివృద్ధి చేస్తున్నారు. వీటివల్ల అభివృద్ధి చేసిన 50,000 ఎకరాలు అందుబాటులోకి రావడంతో పాటు రాష్ట్రంలో ఏర్పాటైన పరిశ్రమల ఉత్పత్తి వ్యయం 80 శాతం వరకు తగ్గనుంది. తద్వారా అంతర్జాతీయ కంపెనీలతో పోటీపడే స్థాయికి ఎదగనున్నట్లు పారిశ్రామిక వర్గాలు విశ్లేషిస్తున్నాయి. పారిశ్రామిక మౌలిక వసతుల కోసం ఈ స్థాయిలో వ్యయం చేస్తున్న రాష్ట్రం దేశంలో మరెక్కడా లేదని పేర్కొంటున్నాయి.


శరవేగంగా సాగుతున్న రామాయపట్నం ఫిషింగ్ హార్బర్ పనులు

కోవిడ్‌లోనే కొప్పర్తి నోడ్ రెడీ

ఒకపక్క కోవిడ్ సంక్షోభం వెంటాడుతున్నా విశాఖ-చెన్నై కారిడార్ పరిధిలోని కొప్పర్తి నోడ్‌ను రాష్ట్ర ప్రభుత్వం శరవేగంగా అందుబాటులోకి తెచ్చింది. విశాఖ-చెన్నై కారిడార్‌లో భాగంగా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాలను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది. ఇందులో 801 ఎకరాల్లో వైఎస్సార్ ఈఎంసీ, 3,053 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్‌ను అభివృద్ధి చేసి అందుబాటులోకి తెచ్చింది. ఇదే కారిడార్‌లో భాగంగా నక్కపల్లి, రాంబిల్లి, శ్రీకాళహస్తి, కొప్పర్తి నోడ్‌లను ఏడీబీ, నిక్‌డిక్ట్ నిధులతో అభివృద్ధి చేస్తోంది. ఏడీబీ నిధులతో తొలిదశలో రూ.2,900 కోట్లతో అభివృద్ధి చేయగా రెండోదశలో రూ.1,633 కోట్లతో అభివృద్ధి పనులకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. దీనికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వంతో ఈనెల 23న ఒప్పందం కుదుర్చుకోనుంది. ఈ ఒక్క కారిడార్ పరిధిలోనే 26,182 ఎకరాలు అందుబాటులోకి రానున్నాయి. ఇక చెన్నై-హైదరాబాద్ కారిడార్ కింద కృష్ణపట్నం వద్ద 11,096 ఎకరాల్లో క్రిస్ సిటీని, హైదరాబాద్ -బెంగళూరు కారిడార్‌లో ఓర్వకల్లు వద్ద 9,305 ఎకరాలను అభివృద్ధి చేయనుంది. ఈ పారిశ్రామిక పార్కులకు అవసరమైన నీటి వసతికి సంబంధించిన పనులను కూడా ఏపీఐఐసీ మొదలు పెట్టింది. మరోవైపు ఇప్పటికే కర్నూలు ఎయిర్‌పోర్టును అందుబాటులోకి తేగా భోగాపురంతోపాటు రామాయపట్నం తెట్టు వద్ద మరో ఎయిర్‌పోర్టు నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

గత ప్రభుత్వానికి భిన్నంగా..

టీడీపీ అధికారంలో ఉండగా తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోకుండా ఎన్నికలకు నెలన్నర ముందు ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రబాబు కొబ్బరికాయ కొట్టి షూటింగ్ ముగించారు. ఇలాంటి వ్యవహారాలకు తావులేకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోర్టుల నిర్మాణానికి అవసరమైన అన్ని కీలక అనుమతులు సాధించడంతో పాటు ఆర్థిక వనరులు (ఫైనాన్షియల్ క్లోజర్) సమకూరిన తర్వాతే పనులు ప్రారంభిస్తున్నారు. ఇప్పటికే రామాయపట్నం, మూలపేట, కాకినాడ గేట్‌వే పోర్టుల నిర్మాణం మొదలు కాగా ఈనెల 22వతేదీన మచిలీపట్నం పోర్టు పనులకు శ్రీకారం చుట్టనున్నారు. ఇందుకోసం ఏపీ మారిటైమ్ బోర్డును నెలకొల్పడమే కాకుండా మూడు పోర్టులకు ప్రత్యేక కంపెనీలను ఏర్పాటు చేశారు. 2022 జూలైలో పనులు ప్రారంభించిన రామాయపట్నం శరవేగంగా సాకారమవుతోంది. ఈ ఏడాది చివరి నాటికల్లా తొలి ఓడను ఇక్కడకు రప్పించే లక్ష్యంతో ముందుకువెళుతున్నారు.

60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి

పోర్టులకు అదనంగా 60,000 మత్స్యకార కుటుంబాలకు ఉపాధి కల్పించేలా తొమ్మిది ఫిషింగ్ హార్బర్లను రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోంది. తొలిదశలో చేపట్టిన జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్లలో పనులు వేగంగా జరుగుతుండటంతో త్వరలో ప్రారంభానికి సిద్ధమవుతున్నాయి. జువ్వలదిన్నె పనులు 86 శాతానికి పైగా పూర్తి కాగా నిజాంపట్నంలో 62 శాతం జరిగాయి. మచిలీపట్నం, ఉప్పాడ ఫిషింగ్ హార్బర్ల పనులు 50 శాతం దాటాయి. ప్రైవేట్ రంగంలో నిర్మిస్తున్న కాకినాడ గేట్‌వే పోర్టుతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న మూడు పోర్టులు, తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల కోసం రూ.18,897 కోట్లు వ్యయం చేస్తోంది. ఈ పోర్టులను ఆనుకుని భారీ పారిశ్రామిక నగరాలను నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇందుకోసం ముగ్గురు ఐఏఎస్ అధికారులతో కమిటీని నియమించారు. రాష్ట్రంలో నెలకొల్పే పరిశ్రమలకు అవసరమైన నిపుణులైన మానవ వనరులను సమకూర్చడంపై కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టిసారించింది. ఇందుకోసం 192 స్కిల్ హబ్స్ ఏర్పాటుతోపాటు 26 స్కిల్ కాలేజీలను ఏర్పాటు చేసింది.

అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా..



పోర్టులు, పారిశ్రామిక పార్కుల నిర్మాణం ద్వారా రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టమైన ప్రణాళికతో ముందుకు వెళుతున్నారు. సహజ వనరులను వినియోగించుకుంటూ మూడు ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి పెట్టారు. రామాయపట్నం పోర్టుతో ప్రకాశం, నెల్లూరు జిల్లాలు, మచిలీపట్నంతో కృష్ణా, ఎన్టీఆర్, మూలపేటతో శ్రీకాకుళం జిల్లాలు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి. దేశంలో ఎక్కడా లేనివిధంగా మూడు పారిశ్రామిక కారిడార్ల ద్వారా 50,000 ఎకరాల భూమిని అందుబాటులోకి తెస్తున్నాం. అన్ని అనుమతులు, ఆర్థిక వనరులు సమకూరిన తర్వాతే సీఎం జగన్ పనులు ప్రారంభిస్తున్నారు. శంకుస్థాపన మరుసటి రోజునుంచే పనులు నిర్విఘ్నంగా కొనసాగాలన్నది సీఎం ఆకాంక్ష.

– గుడివాడ అమర్నాథ్, పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి

జాతీయ స్థాయిలో గుర్తింపు..

అత్యంత ప్రతిష్టాత్మకంగా తీరప్రాంత అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ బిజినెస్ దినపత్రిక 'ఎకనామిక్ టైమ్స్'దేశీయ ఇన్‌ఫ్రా రంగంపై ఏటా ప్రకటించే అవార్డుల్లో ఈసారి మనకు చోటు దక్కింది. దేశంలో పోర్టు ఆధారిత మౌలిక వసతుల కల్పనలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాధించిన అత్యున్నత ప్రగతిని గుర్తిస్తూ ఇన్‌ఫ్రా ఫోకస్ అవార్డుకు ఎంపిక చేసినట్లు పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక మౌలిక వసతులకు పెద్దపీట వేస్తుండటంతో దిగ్గజ సంస్థలైన అదానీ, అంబానీ, మిట్టల్, బిర్లా, భంగర్, భజాంకా, సంఘ్వీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్నాయి. ఈ ఏడాది మార్చిలో విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్‌లో 386 ఒప్పందాల ద్వారా రూ.13,11,468 కోట్ల విలువైన పెట్టుబడులు రావడమే దీనికి నిదర్శనం. గతేడాది చివరి త్రైమాసికంలో అత్యధిక పెట్టుబడులను ఆకర్షించిన రాష్ట్రంగా ఏపీ మొదటి స్థానంలో ఉన్నట్లు ప్రాజెక్ట్స్ టుడే సర్వే వెల్లడించింది.


జిల్లా వార్తలు

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం


దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ ఉద్యోగులు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామ చంద్ర స్వామివారి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు ఆదివారం విరాళం అందజేశారు. హైదరాబాద్‌లోని చందానగర్‌కు చెందిన బెల్లంకొండ అలివేలమ్మ, నర్సింహులు రూ.50 వేల విరాళాన్ని అందజేసి స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఉద్యోగులు రామిరెడ్డి, సాయిబాబు పాల్గొన్నారు.

కోయగూడెం ఓసీలో పర్యటించిన డైరెక్టర్


ఓసీలో పనులను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: మండలంలోని కోయగూడెం ఓసీలో సింగరేణి డైరెక్టర్ జి.వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా రోజువారీ బొగ్గు ఉత్పత్తి, ఓబీ వెలికితీత, లోడింగ్‌ను పరిశీలించిన ఆయన రోజువారీ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. అలాగే, రక్షణతో కూడిన ఉత్పత్తిపై దృష్టి సారించాలని తెలిపారు. ఏరియా జీఎం ఎం.షాలెంరాజు, కేటీసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్వీఆర్ ప్రహ్లాద్‌తో పాటు సౌరభ్ సుమన్, శివశంకర్, యూసుఫ్, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంక్రైం: ఖమ్మం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని శ్రీకృష్ణప్రసాద్ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వర్తించేందుకు ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల చైర్‌పర్సన్ హృదయ్ మీనన్ తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కంప్యూటర్ బోధించేందుకు బీఎస్సీ కంప్యూటర్స్, బీసీఏ చేసిన అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. అలాగే, 6 నుంచి 9వ తరగతి వరకు బోధించేందుకు బీటెక్, ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్) పూర్తి చేసిన అభ్యర్థులు ఈ నెల 24లోగా దరఖాస్తులు పంపించాలని సూచించారు.

ఆ ఆవుదూడలన్నీ దేవుడి సేవలోనే..

- 'లక్ష్మి'కి పన్నెండేళ్లలో పది దూడలు జననం
- నాలుగు కోడెలు ఆంబోతులుగా, ఒక ఆవుదూడ ఆలయానికి...
- ఇంట్లో నిత్యం లక్ష్మీ కళే అంటున్న యజమానులు

ఖమ్మంఅర్బన్: ప్రతీ జీవి భూమి మీదకు వచ్చేటప్పుడే విధిరాత రాసి ఉంటుందనేది అందరి నమ్మకం. ఇదేక్రమంలో ఆ ఆవుకు పుట్టిన దూడలన్నీ దైవసన్నిధిలో పూజలందుకుంటుండడం విశేషం. ఖమ్మం టేకులపల్లికి చెందిన బాజిన్ని వీరయ్య, తిరుపతిరావుకు చెందిన ఆవు కడుపున పుట్టిన దూడలన్నీ ప్రత్యేకత చాటుకుంటున్నాయి. లక్ష్మి అని పేరు పెట్టుకున్న ఆ ఆవు సంతానంలో సగానికి పైగా భక్తులతో నిత్యం పూజలు అందుకుంటూ ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఖమ్మం ఇందిరానగర్ బాలగణపతి ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులైన వీరయ్య, తిరుపతిరావు సోదరులు. పన్నెండేళ్ల క్రితం ఇంట్లో ఆవు ఉంటే లక్ష్మీ కళ ఉట్టిపడుతుందనే పెద్దల సూచనలతో వీరు వైరా మండలం సోమవరం నుంచి ఒక ఆవును కొనుగోలు చేశారు. దీనికి లక్ష్మి అని పేరు పెట్టి ఇంట్లో ఒకరిలా చూస్తూ పూజలు చేస్తున్నారు.

ఎక్కడెక్కడికంటే..

మొదటి కోడె దూడ(ఆంబోతు)ను ముదిగొండ మండలం లక్ష్మీపురం, రెండో దూడ కోదాడ, మూడో దూడ కాచిరాజుగూడెం కస్నాతండా, నాలుగో దూడ(ఆంబోతు)ను కోదాడ మండలం తగ్గరాయి గ్రామంలో దేవాలయ ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా వితరణగా అందించారు. ఇక ఐదో దూడను పందెం గిత్తగా ఏపీ రాష్ట్రం వారు తీసుకెళ్లగా ఆరో దూడ తల్లి వద్ద పాలు తాగుతోంది. అలాగే, ఆవు దూడల్లో ఒకటి నగరంలోని రాజరాజేశ్వరి ఆలయ గోశాలకు, మరో ఆవును తల్లాడ మండలానికి చెందిన రైతుకు ఇవ్వగా అది విద్యుదాఘాతంతో మృతి చెందింది. మరో ఆవు బాజిన్ని సోదరులు తమ వద్దే పెంచుకుంటుండగా అది కూడా ఇటీవల కోడె దూడకు జన్మనిచ్చింది. ఇంకో ఆవును తల్లాడ మండలానికి చెందిన వారు తీసుకెళ్లారు. 'లక్ష్మి' సంతానంలో అత్యధికంగా దేవుడి పూజలకు ఉపయోగపడుతుండడం తమకు ఎంతో ఆనందాన్నిస్తోందని వారు చెబుతున్నారు.


ఆంబోతు కోసం తీసుకెళ్తున్న కోడెదూడకు పూజ చేస్తున్న కోదాడ వాసులు (ఫైల్)

పది దూడలకు జన్మ..

ఆ ఆవు ఇప్పటికి పది దూడలకు జన్మనిచ్చింది. ఇందులో ఆరు కోడె దూడలు, నాలుగు ఆవుదూడలు ఉన్నాయి. కోడె దూడలు పెరిగి పెద్దయ్యాక వాటి అందం, ఆకారం చూసి ఆంబోతులకు సరిపడే వన్నె ఉందని గుర్తించిన పలువురు తీసుకెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో బాజిన్ని సోదరులు కూడా ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఇస్తున్నారు.


దూడకు పాలు ఇస్తున్న ఆవు 'లక్ష్మి'

వేల మంది పూజలు

ఖమ్మం చుట్టుపక్కల ఎవరి గృహ ప్రవేశం ఉన్నా, పూజలు జరిగినా లక్ష్మి ఆవును తీసుకెళ్తారు. ఈ ఆవు బెరుకు, భయం లేకుండా భక్తుల మధ్యలో త్వరగా కలిసిపోతుంది. అందుకే ఆలయాల్లో పూజలు, గృహప్రవేశాలకు తీసుకెళ్తుండగా వేలాది మంది పూజలు అందుకుంటోంది. అలాగే, వీరయ్య, తిరుపతిరావు ఇళ్లలోనూ ఇది కుటుంబ సభ్యులతో కలిసిపోతుండగా.. చినజీయర్ స్వామి ఖమ్మం వచ్చిన సమయంలో లక్ష్మి ఆవుకు పూజలు చేశారు.

ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నాం..



మా ఇంట్లో లక్ష్మి ఆవును ఎంతో ఇష్టంగా పెంచుకుంటున్నాం. పన్నెండేళ్లుగా ఈ ఆవు, దాని కడుపున పుట్టిన సంతానం, వాటికి పుట్టిన సంతానాన్ని సైతం మా ఇంటి సభ్యుల్లాగే భావిస్తాం. ఇవన్నీ దైవ కార్యక్రమాలకు ఉపయోగపడుతుండడం ఆనందంగా ఉంది.

– బాజిన్ని వీరయ్య, బాలగణపతి ఆలయచైర్మన్

పూజలు అందుకుంటున్నాయి..



పశు సంపదపై ఉన్న ఇష్టంతో ఆవుదూడను తెచ్చి పెంచుకుంటే దీంతో పాటు సంతానం కూడా పూజలు అందుకుంటున్నాయి. దూడలన్నీ ఉచితంగానే ఇచ్చాం. ఒక్కో దూడను తీసుకెళ్తున్నప్పుడు మా ఇంటి సభ్యురాలే వెళ్తున్నట్లుగా బాధపడతాం.

– బాజిన్ని తిరుపతిరావు, దేవాలయ కార్యదర్శి

ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలించిన నిపుణులు

అశ్వారావుపేటరూరల్: త్వరలో రైతులకు అందించనున్న ఆయిల్‌పామ్ మొక్కలను ఆదివారం ఉద్యానవన నిపుణుల బృందం పరిశీలించింది. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం వద్ద ఉన్న కేంద్రియ నర్సరీ ద్వారా వచ్చే వానాకాలం సీజన్‌లో రైతులకు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యాన సిద్ధంగా ఉన్న మొక్కలను ఉద్యాన నిపుణల బృందం రాహుల్‌మిశ్రా, ఉమాదేవి, రామకృష్ణారెడ్డి పరిశీలించి ఎదుగుదలకు ఉన్న అవకాశాలపై ఆరా తీశారు. ఆ తర్వాత పంపిణీ చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో డీఓ ఆకుల బాలకృష్ణ, అధికారులు రాధాకృష్ణ, మహేశ్, అశోక్ పాల్గొన్నారు.


మొక్కలను పరిశీలిస్తున్న అధికారులు

సింగరేణిలో సబ్‌కాంట్రాక్టర్లదే హవా

- అమ్మకానికి కాంట్రాక్టు ఉద్యోగాలు
- పర్మనెంట్ ఉద్యోగాలుగా నమ్మబలికి వసూళ్లు
- అధికారుల నియంత్రణ కొరవడడంతోనే ఈ పరిస్థితి


సింగరేణి ఉద్యోగాల పేరిట మోసపోయిన బాధితులు

సత్తుపల్లి: అక్రమార్కులకు సింగరేణి వరప్రసాదంగా మారింది. సంస్థలో ఉద్యోగాలిప్పిస్తామని పలువురు అందినకాడికి దండుకుంటున్న విషయం అధికారుల దృష్టికి వచ్చినా చర్యలు అంతంత మాత్రంగానే ఉండటండం అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. కొత్తగూడెం ఏరియా పరిధిలోని సత్తుపల్లి సమీపాన జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, కోల్‌హ్యాండ్లింగ్ ప్లాంట్, సెక్యూరిటీ, క్యాంటీన్ విభాగాలలో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన విషయం తాజాగా వెలుగు చూసిన విషయం విదితమే. డెయిలీ లేబర్ వర్క్ ఆర్డర్ పట్టుకుని సబ్ కాంట్రాక్టర్లు యథేచ్ఛగా పర్మనెంట్ ఉద్యోగాలు ఉన్నాయంటూ నమ్మబలికి వసూలు చేయడం గమనార్హం. ఈ ఘటనలో శరత్‌చంద్ర, హరీష్‌పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. వాస్తవానికి డెయిలీ లేబర్ కింద జేవీఆర్ ఓసీలో 10 మంది, క్యాంటీన్‌లో 14 మంది, బెల్ట్ క్లీనింగ్‌లో 10 మంది, సీఎస్‌పీ కింద 40 మందికి మాత్రమే పని కల్పించే అవకాశం ఉంది. వీరందరికీ రోజుకు రూ.460 చొప్పున చెల్లిస్తారు. కానీ పెద్దసంఖ్యలో ఉద్యోగాలు అదీ పర్మనెంట్ అని నమ్మబలికి కుచ్చు టోపీ పెట్టడంతో డబ్బులు ఇచ్చిన వారు లబోదిబోమంటున్నారు.

అసలు కాంట్రాక్టర్‌కు బాధ్యత లేదా?

సత్తుపల్లి ఏరియా పరిధిలోని ఓపెన్ కాస్టుల్లో కొత్తగూడెం ఏరియాకు చెందిన పలువురు కాంట్రాక్టర్లు పనులు దక్కించుకుని సబ్ కాంట్రాక్టర్లకు ఇచ్చారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా సింగరేణి అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో అక్రమార్కులకు ఊతమిచ్చినట్లవుతోంది. సబ్ కాంట్రాక్టర్లు దర్జాగా తిరుగుతూ నిరుద్యోగులకు వలవేసి ఉద్యోగాలిప్పిస్తామని రూ.లక్షల్లో వసూలు చేసి ఆతర్వాత ముఖం చాటేస్తున్నారు. రోజుకు రూ.460వచ్చే డెయిలీ లేబర్ పని కోసం రూ.40వేల నుంచి రూ.50వేల వరకు వసూలు చేసినట్లు సమాచారం. సబ్‌కాంట్రాక్టర్లకు అసలైన కాంట్రాక్టర్ నుంచి ఆథరైజేషన్ లెటర్ లేకున్నా యథేచ్ఛగా అధికారుల ముందే పనులు చక్కబెడుతుండడం విమర్శలకు తావిస్తోంది. కాగా, సబ్ కాంట్రాక్టర్ ముసుగులో పర్మనెంట్ ఉద్యోగాలిప్పిస్తానని బీటెక్, డిప్లొమా, డిగ్రీ చేసిన నిరుద్యోగుల నుంచి రూ.లక్షల్లో వసూలు చేసిన పరారైన శరత్‌చంద్ర విషయంలో అసలు కాంట్రాక్టర్ కొత్తగూడేనికి చెందిన సూర్య కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులకు బాధ్యత లేదా అని బాధితులు నిలదీస్తున్నారు. ఇకనైనా అటు కాంట్రాక్టర్, ఇటు సింగరేణి యాజమాన్యం బాధ్యత వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

డెయిలీ లేబర్‌గా..

జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీల్లో నిరుద్యోగులను డెయిలీ లేబర్ కింద మస్టర్ వేయించి నెలల తరబడి పని చేయించుకున్నారని.. పర్మనెంట్ ఉద్యోగం ఎప్పుడు ఇస్తారని అడిగితే తీసేశారని సమాచారం. అంతేకాక చేసిన పనికి వేతనాలు ఇవ్వకపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. సింగరేణి సంస్థలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేసి మస్టర్ పడిన లెక్కలు ఉంటాయని, ఈ జాబితా ఆధారంగా కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని ఇంత కాలం చేసిన పనికి వేతనాలు ఇప్పించాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయమై కిష్టారం పీఓ నర్సింహారావు స్పందిస్తూ డెయిలీ లేబర్ కింద మస్టర్ ఉన్న వారికి వేతనాలు ఇప్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సబ్‌కాంట్రాక్టర్ శరత్ చంద్రపై అసలైన కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేశామని, బాధితులకు న్యాయం చేసేలా తమవంతు ప్రయత్నం చేస్తామని పేర్కొన్నారు.

వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి రాతపరీక్ష

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న 11 వెల్ఫేర్ ఆఫీసర్ ట్రెయినీ ఈ–1 గ్రేడ్(ఇంటర్నల్) పోస్టుల భర్తీకి ఆదివారం రాతపరీక్ష నిర్వహించారు. కొత్తగూడెంలోని సింగరేణి మహిళా కళాశాలలో జరిగిన పరీక్ష కోసం 672 మందికి హాల్ టికెట్లు జారీ చేయగా 602 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను డైరెక్టర్(పా) ఎస్.బలరామ్ పరిశీలించారు. అనంతరం జీఎం కె.బసవయ్య మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారులను నమ్మొద్దని, నియామకాలన్నీ పారదర్శకంగా జరుగుతున్నాయని తెలిపారు. పరీక్ష నిర్వహణను సింగరేణి అధికారులు కె.ప్రసాద్‌రావు, బి.హనుమంతరావు, శశిధర్‌రాజు, ధన్‌పాల్ శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, పి.వేణుగోపాల్‌రావు తదితరులు పర్యవేక్షించారు.


రాత పరీక్షను పరిశీలిస్తున్న డైరెక్టర్ బలరామ్